క్లుప్తంగా

వడ్డీ రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

ఎచ్చెర్ల: ఎస్ఎంపురం పీఏసీఎస్ ద్వారా రుణాలను తీసుకున్న రైతులకు అందిస్తున్న వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ సనపల నారాయణరావు తెలిపారు. పీఏసీఎస్ పరిధిలో ఉన్న కో ఆపరేటివ్ బ్యాంక్‌లో బకాయిలున్న రైతులు ఫిబ్రవరి 28వ తేదీ లోగా రుణాలు చెల్లిస్తే 7 శాతం వడ్డీతో చెల్లించవచ్చన్నారు. లేకంటే 13 శాతం వడ్డీతో చెల్లించాల్సి వస్తుందన్నారు. రుణాల రెన్యువల్స్‌కు 1బీ ఒరిజనల్, ఆధార్ జిరాక్స్‌ను కార్యాలయంలో అందజేయాలన్నారు.

పాఠశాలలో విద్యా దినోత్సవం


మాట్లాడుతున్న నటుకుల మోహన్

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో లయన్స్‌క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విద్యా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ మెంటర్ నటుకుల మోహన్ మాట్లాడుతూ.. చదువుకున్న పాఠశాలలోనే విద్యాదినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, జిల్లా కార్యదర్శి శిల్లా రాంగోపాల్, సభ్యులు తిరుమలరావు, ట్రేజరర్ శిల్లా మణి, ఉపాధ్యాయులు రేవతి, గోవిందరావు, స్వాతి, వరలక్ష్మి ఉన్నారు.

న్యాయవాదులకు సన్మానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బార్‌అసోసియేషన్ సభ్యులు రాష్ట్రస్థాయిలో పదవులకు ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా బార్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అన్నారు. ఏపీ రాష్ట్ర టెన్యూర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా వాన కృష్ణచంద్, సభ్యుడుగా తంగి శివ ప్రసాద్‌లు ఎన్నికైన సందర్భంగా వారిని బుధవారం సత్కరించారు. అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, ఉపాధ్యక్షుడు గొంటి చంద్రమోహన్, లైబ్రరీ సెక్రటరీ ఎం.భవానీ ప్రసాద్, బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు పాల్గొన్నారు.

వర్సిటీలో పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్. రజిని బుధవారం 'టీచింగ్ ఫొనిటిక్స్ ఇన్ ఇండియన్ కాంటెక్స్' అనే పుస్తకాన్ని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. బోధకులు డాక్టర్ విశ్వేశ్వరరావు, డాక్టర్ రవికుమార్ సంయుక్తంగా ఈ పుస్తకాన్ని రాశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య పాల్గొన్నారు.

కబడ్డీలో శ్రీకాకుళం అదుర్స్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు అదరగొట్టారు. కర్నూలు జిల్లా నంద్యాల వేదికగా ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగిన 49వ ఏపీ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా బాలికల జట్టు రన్నర్‌ప్‌గా, బాలురు జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. ఈజట్లకు కోచ్ మేనేజర్లుగా జె.నారాయణ, బి.శేషగిరి, ఎస్.కాంతారావు, జె.శ్యామలరావు వ్యవహరించారు. వీరిని జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ సీదిరి అప్పలరాజు, అధ్యక్షుడు ధర్మాన రామలింగంనాయుడు, కార్యదర్శి సాదు శ్రీనివాసరావు, ఒలింపిక్ సంఘ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు అభినందించారు.

సర్వేయర్లకు శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రం (టీటీడీసీ)లో బుధవారం గ్రామ సచివాలయాల సర్వేయర్లకు సాంకేతిక అంశాలపై మూడు రోజుల శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిసోర్సుపర్సన్ జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల నిర్వహణలో అనేక మార్పులు వస్తున్నాయని తెలిపారు. పూర్తిస్థాయి సాంకేతిక అంశాలు, రికార్డుల ఆధునికీకరణ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు.

ఆకట్టుకుంటున్న మహాస్థూపం


విద్యుత్ అలంకరణలో మహాస్థూపం

జి.సిగడాం: మండలంలోని ఆనందపురంలో షిరిడీ సాయిబాబా వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబైంది. 100 అడుగుల వెంకట సాయికోటి మహాస్థూపం విద్యుత్ అలంకరణలతో ఆకట్టుకుంటోంది. ఈ నెల 26న జరిగే ప్రధాన వేడుకలకు సుమారు రెండు లక్షల మంది బాబా భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్మాత మక్క వెంకటసాయి తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే సాక్ష్యం


గార: మాట్లాడుతున్న రామ్‌మనోహర్‌నాయుడు


శ్రీకాకుళం రూరల్: హాజరైన మహిళలు, నాయకులు


జి.సిగడాం: వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


శ్రీకాకుళం రూరల్: చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన

- ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు
- ఆసరా సంబరాల్లో మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

గార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధే ఉత్తమ పాలనకు సాక్ష్యమని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన రామకృష్ణాపురం వద్ద అంపోలు-1, అంపోలు-3, కొత్తూరు-షైరిగాం, సతివాడ పంచాయతీలో డ్వాక్రా సంఘ సభ్యులకు ఆసరా నాలుగో విడత నిధుల పంపిణీ సందర్భంగా బుధవారం జరిగిన సంబరాల్లో ఆయన మాట్లాడారు. మీ స్కూల్ బాగుపడింది దీనికి వేరే సాక్ష్యం కావాలా? మీ అబ్బాయి కార్పొరేట్ స్కూల్‌లా దర్జాగా స్కూలుకు వెళుతున్నాడు అది సాక్ష్యం కాదా అని ప్రశ్నించారు. గత ఎన్నికల ముందు మీ రుణం తీర్చేస్తామని చెప్పిన చంద్రబాబు ఎన్నికల సమీపంలో పసుపు కుంకుమ అని కొంత వేసేశారని ఎద్దేశా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మీ రుణం నాలుగు విడతలుగా చెల్లించడం జరిగిందన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని, మీరు వేసే ఓటుతో మరో ఐదేళ్లు మంచి నాయకత్వం వస్తోందన్నారు. ఐదేళ్ల పాటు ఎవ్వరికీ తలవంచకుండా, భయపడకుండా, చిరునవ్వుతో ఉండేలా ఓటు వేయాలన్నారు. మీ ఎదురుగా ఇద్దరు నాయకులున్నారని, వారిలో మాయమాటలు చెప్పి ఓటు వేశాక అమలుచేయకుండా మోసం చేసిన వ్యక్తి ఒకరయితే, ఇచ్చిన మాటకు కట్టుబడి అమలు చేసిన వ్యక్తి జగన్ అన్నారు. మహిళల పేరిట అన్ని పథకాలు ఇస్తున్నామని, ఇంటి ఇల్లాలును యజమానురాలిగా చేశామన్నారు. కుటుంబ సభ్యులకు మనకి వచ్చిన ఇళ్లు, నీ చదువులు, పథకాలు ఈ ప్రభుత్వం వల్లే వచ్చిందని చెప్పాలన్నారు. మండల కేంద్రానికి వెళ్లకుండా గ్రామంలోనే సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుతో పాటు వలంటీరు వ్యవస్థ ఏర్పాటు చేసి ఇంటివద్దకే పథకాలను చేరుస్తున్నామని చెప్పారు. ఈ పథకాల అమలుకు నాయకులు ఎవ్వరైనా రూపాయి అడిగారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరిట ఉండేవారని, పొలం పనులకు వెళ్లకపోయినా, జెండా కట్టకపోయినా పింఛన్ తీసేస్తామని బెదిరించేవారని, ఈ ప్రభుత్వం ఓటు వేసినా, వేయకపోయినా అన్ని పథకాలు అందిస్తున్నామన్నారు. మీ అందరి కోరికపైనే పోటీ చేస్తామని, మీ ఉద్దేశం చెప్పాలన్నారు. పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అమలుచేసి ఇంటి వద్దకే అందిస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని.. పేద ప్రజల కన్నీళ్లు తుడిచిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మాలన్నారు. కార్యక్రమంలో యాళ్ల నారాయణమూర్తి, మార్పు రమణ, పెదలాపు సింహాచలం, పార్టీ కన్వీనర్ పీస గోపి, అరవల రామకృష్ణ, అందవరపు బాలకృష్ణ, ముంజేటి కృష్ణమూర్తి, సుగ్గు లక్ష్మీనరసింహాదేవి, శిమ్మ ధర్మరాజు, పీస శ్రీహరిరావు, మార్పు పృథ్వీరాజ్, కొయ్యాన నాగభూషణం, ముద్దాడ గోవిందరావు, కోట రామారావు, రుప్ప శ్రీనివాసరావు ఉన్నారు.

మాట ఇచ్చాం.. చేసి చూపించాం

శ్రీకాకుళం రూరల్: ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పెదపాడు, పొన్నాం పంచాయతీల పరిధిలో బుధవారం గొల్లపేట, బమ్మిడివానిపేట, నవనంబాడు, గేదెలవానిపేట, బట్టేరు, నైరా గ్రామాలకు చెందిన ఆసరా మహిళలతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2014లో చంద్రబాబు మోసపూరిత హామీలు ఇచ్చారు తప్పితే ఏఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ప్రస్తుతం పేదవర్గాలకు చెందిన వారంతా ధైర్యంగా బతుకుతున్నారంటే ముఖ్యమంత్రి జగన్ తీసుకొచ్చిన సంక్షేమ ఫలాలే కారణమన్నారు. అధికారం కోసం చంద్రబాబు ప్రజలను తప్పుతోవ పట్టేవిధంగా ప్రతీ ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్ల పేరిట మాయమాటలతో మరోసారి ముందుకు వస్తున్నారన్నారని ఎవ్వరూ నమ్మవద్దన్నారు. మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు అధ్యక్షతన పెదపాడు పరిధిలో జరిగిన ఆసరా కార్యక్రమంలో భాగంగా రూ.24 కోట్ల రక్షిత నీటి పథకం పనులకు మంత్రి ధర్మాన శంకుస్థాపన చేశారు. పనులు పూర్తయితే పెదపాడు, చాపురం, చెట్లోడుపేట, వానవానిపేట గ్రామాలకు పూర్తిగా మంచినీటి సరఫరా జరుగుతోందన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నగదు చెక్‌ను అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ.. ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, మెప్మా పీడీ విద్యాసాగర్, ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతాబు, పార్టీ నాయకులు నీలంశెట్టి రామకృష్ణ, రావాడ మోహన్, పొన్నాన రామారావు, బొబ్బాది చంద్రమౌళి, యజ్జల గురుమూర్తి, రుప్ప అప్పలసూరి, బగ్గు అప్పారావు, నక్క శంకర్, ఊటపల్లి కృష్ణ, మూల క్రిష్ణవేణి, ఏపీఎం సుజాత ఉన్నారు.

అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు

జి.సిగడాం: రాష్ట్రంలో ప్రతి మహిళను లక్షాధికారిణి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.8,93,22,681 చెక్కును మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లోనూ పెద్దపీట వేసిందన్నారు. పాదయాత్రలో మహిళలు పడుతున్న కష్టాలను నేరుగా చూసిన సీఎం జగన్.. వారిని అన్ని విధాలుగా ఆదుకోవడానికి వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి పథకాలను అమలు చేశారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం ప్రజలకు చేరువయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల రాణి, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, మండల మహిళా కన్వీనర్ కంది రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ ఎర్నేన ప్రకాశరావు, స్థానిక సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కీర్తి తవుడమ్మ, ఐకేపీ ఏసీ రవికుమార్, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: నిరుపేద మత్స్యకారుడు పోలరాజు కుటుంబాని రూ.3 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం అందజేశారు. మండలంలోని కొచ్చెర్ల పంచాయతీ కొమరవానిపేటకు చెందిన పోలరాజు క్యాన్సర్‌తో బాధపడుతూ ఈ నెల 17న పోలిరాజు మృతి చెందారు. మృతి భార్యకు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించి చెక్కు అందజేశారు. పోలరాజు క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయాన్ని ఇటీవల పలాసకు విచ్చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీఎం జగన్ వెంటనే స్పందించారు. తక్షణ సాయంగా రూ.లక్ష అందజేయాలని కలెక్టర్‌కు ఆదేశించడంతో ఆ మొత్తం సమకూర్చారు. పరామర్శించిన వారిలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బస్వ దురుగుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు చుక్క రమణ, మాగుపల్లి రాముడు, మూగి సన్యాసి, బస్వ రామురెడ్డి, పట్నాన అప్పన్న రెడ్డి, అసిరిరెడ్డి, కొమర నిలేకరి, వారిధి సత్యం, లక్ష్మణ, కొర్లయ్య, జీరు యుగంధర్ తదితరులు ఉన్నారు.

కొత్త దరఖాస్తులకు సప్లిమెంటరీ జాబితాలో చోటు


మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ఇతర సవరణలకు గత 41 రోజుల్లో 21,242 దరఖాస్తులు అందాయని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా (ఎస్ఎస్ఆర్ 2024)లో అభ్యంతరాలు ఉంటే తమ దష్టికి తీసుకురావాలని కోరారు. తాజాగా వచ్చిన ఫారం 6, 7, 8 లను పరిశీలించి సప్లిమెంటరీ ఓటరు జాబితాలో చేరుస్తామన్నారు. ఈ నెల 25న జరిగే ఓటర్ల దినోత్సవంలో అందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు ఎస్.సత్యనారాయణ, కె.వి.రామరాజు, దేశెళ్ల మల్లిబాబు, సోమేశ్వరరావు, ఏ.కృష్ణారావు, సురేష్‌బాబు సింగ్, సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాష్ రావు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- నియోజకవర్గ ఆడుదాం-ఆంధ్రా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కిరణ్ కుమార్


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయి ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలను చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో బుధవారం ప్రారంభించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. నియోజవర్గంలోని ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు, జి.సిగడాం మండలాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయి క్రీడా పోటీలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించినట్లు చెప్పారు. అన్ని సచివాలయాల పరిధిలో క్రీడలకు మంచి స్పందన లభించిందన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. క్రీడలను ఎచ్చెర్ల నియోజకవర్గ ఆడుదాం-ఆంధ్రా పరిశీలకులు, జిల్లా పరిషత్ కార్యనిర్వహణ అధికారి ఆర్.వెంకటరామన్ పర్యవేక్షించారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ముద్దాడ శంకర్, పార్టీ నాయకులు డొంక వెంకటకరమణ, కొత్తకోట సూర్యారావు, మాడుగుల మురళీధర్‌బాబా, బగ్గు రాజారావు, చిలక సన్యాసప్పడు, వెంకునాయుడు, డొంక శ్రీను, ముని పాపారావు, గవిరెడ్డి రవికుమార్ పాల్గొన్నారు.

అధ్యాపకులకు సూక్ష్మ పద్ధతులపై శిక్షణ



శిక్షణలో అధ్యాపకులు

శ్రీకాకుళం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) శ్రీకాకుళం నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో టీవోటీ కార్యక్రమాన్ని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, యునెస్కో సంయుక్త ఆధ్వర్యంలో అధ్యాపకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థిలో దాగిఉన్న ప్రతిభను, భావోద్వేగ పరిస్థితులను బయటకు తీసుకువచ్చేలా అధ్యాపకులు బోధన చేయాలని ప్రిన్సిపాల్ పి.సురేఖ అన్నారు. రిసోర్స్ పర్సన్లుగా ఆర్.రవిశంకర్, కోటేశ్వరరావు, పి.జమున వ్యవహరించారు. జిల్లాలో 126 కాలేజీల నుంచి ఆధ్యాపకలు శిక్షణ పొందారని ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం అర్బన్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలందరూ బుధవారం విధుల్లో చేరారని ఐసీడీఎస్ పీవో శోభారాణి తెలిపారు. 176 మందికి 173 మంది విధుల్లో చేరారని, మరో ముగ్గురు మెడికల్, మెటర్నరీ లీవ్‌ల్లో ఉన్నారన్నారు. ఆయాలు 170 మంది విధుల్లో చేరారన్నారు.

కర్పూరి ఠాకూర్‌కు భారతరత్నపై హర్షం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బిహార్ మాజీ సీఎం కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం సంతోషించదగ్గ విషయమని జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు అన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కర్పూరి ఠాకూర్ నాయీబ్రాహ్మణ కులంలో పుట్టి అంచెలంచెలుగా బిహార్‌లాంటి రాష్ట్రంలో రెండుసార్లు సీఎంగా, ఉపముఖ్యమంత్రిగా పరిపాలన సాగించడం విశేషమన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో డాక్టర్ ఆర్.అరవింద్, జిల్లా నాయీబ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొరుపూరు గజపతిరావు, ఎస్.వి.జగన్నాథం, ఉపాధ్యక్షుడు టి.కర్రెన్న, సీహెస్ కన్నయ్య, గొలివి సింహాచలం, కొండలరావు, తవుడు, కృష్ణప్రసాద్ ఉన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం


గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కొంగరాంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.40 లక్షలతో నిర్మించి గ్రామ సచివాలయం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ కోట్ల రూపాయలతో ప్రభుత్వ భవనాలు, సిమెంట్ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గ్రామాల స్వరూపం మారిందన్నారు. గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ నవరత్నాలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అభివృద్ధి సైతం అదే స్థాయిలో జరిగిందన్నారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, కార్పొరేషన్ డైరెక్టర్ నక్క కృష్ణమూర్తి, సర్పంచ్ గుండ భాగ్యశ్రీ, పార్టీ నాయకులు బెండు రామారావు, మాడుగుల మురళీధర్‌బాబా, బగ్గు రాజారావు, బొడ్డేపల్లి సుధాకర్, నేతింటి నీలం, గుండ రవి పాల్గొన్నారు.

విద్యతోనే గౌరవం


కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తోందని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సింగుపురం గ్రామంలోని ప్రశాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి క్రాంతి విద్యానికేతన్ స్కూల్ 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం నిర్వహించిన రజతోత్సవ వేడుకల్లో మంత్రి ధర్మాన పాల్గొని మాట్లాడారు. మెరుగైన విద్యను అందిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం స్కూల్ సావనీర్‌ను ఆవిష్కరించారు. డీఈవో వెంకటేశ్వరరావు, క్రాంతి విద్యానికేతన్ కరస్పాండెంట్ గుండ అమ్మడు, డిప్యూటీ ఈవో విజయకుమారి, ఎంపీపీ అంబటి నిర్మలా, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, పార్టీ నాయకులు అంబటి శ్రీనివాసరావు, బగ్గు అప్పారావు, బాణ నర్సింగరావు, నక్క శంకర్ పాల్గొన్నారు.

ఉపాధి వేతనాల చెల్లింపులో అవకతవకలు


మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

రణస్థలం: స్థానిక మండల పరిషత్ ఆవరణంలో 2022-23లో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక సమావేశాన్ని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. 34 పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులపై సమీక్ష చేపట్టారు. ఉపాధి, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్ శాఖల్లో 1389 పనులు చేపట్టగా.. సుమారు రూ.25 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. మెంటాడలో మృతి చెందిన ఐదుగురికి ఉపాధి మేటు సత్యనారాయణ హాజరు వేయడంతో ఆన్‌లైన్‌లో వేతనాలు చెల్లింపులు జరిగాయని గుర్తించారు. దీనిపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పైడిభీమవరం పంచాయతీలోని దేవునిపాలవలస గ్రామంలో పరిశ్రమకు చెందిన చెరువులో ఉపాధి పనులు చేయడం అప్పట్లో వివాదాస్పదమైంది. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని ఏపీడీ లోకేష్‌కు పీడీ ఆదేశించారు. పలు పంచాయతీల్లో మస్టర్ల సీట్లలో వేలిముద్రలు వేయకుండా వేతనాలు చెల్లించడంపై ఫీల్డ్ అసిస్టెంట్లపై అసహనం వ్యక్తం చేశారు. సీసీ రోడ్లు, గృహ నిర్మాణాల్లో జరిగిన కొలతలు, నాణ్యతా ప్రమాణాలపై చర్చించారు. సీనియర్ క్వాలిటీ కంట్రోలర్ వి.సతీష్‌బాబు, జిల్లా విజిలెన్స్ అధికారి లోవరాజు, పరిశీలన అధికారి రాజు, ఏపీడీ కె.లోకేష్, మండల ప్రత్యేకాహ్వానితుడు పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ఏపీఓ ఎం.శ్రీనివాసనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కంటికి రూపం- ఇంటికి దీపం ఆడపిల్ల


శ్రీకాకుళం న్యూకాలనీ: హయాతీనగరంలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న బాలికలు


శ్రీకాకుళం క్రైమ్: మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: కంటికి రూపం, ఇంటికి దీపం ఆడపిల్లలేనని శ్రీకాకుళం హయాతీనగరంలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి అన్నారు. బాలికలు చదువులో బాగా రాణించి ఉన్నత స్థానాలకు చేరుకొని గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉన్నత స్థానాలకు ఎదిగిన మహిళలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రసంగాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో..

శ్రీకాకుళం పాతబస్టాండ్/శ్రీకాకుళం క్రైమ్: జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో మహాలక్ష్మీనగర్ కాలనీలో శ్రీచైతన్య హైస్కూల్‌లో జిల్లా మహిళా శిశు అభివృద్ధి, సాధికారత అధికారిణి బి.శాంతిశ్రీ అధ్యక్షతన బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు గడిచినప్పటికీ ఇప్పటి వరకు దేశ ప్రధాన న్యాయమూర్తిగా ఒక మహిళ కూడా ఎంపిక కాకపోవడం బాలికలపై ఉన్న వివక్షతకి అర్థం పడుతుందన్నారు. బాలికల విద్య, సమాజ అభివృద్ధిని వివరించారు. జిల్లా మహిళా శిశు అభివృద్ధి, సాధికారత అధికారిణి శాంతిశ్రీ మాట్లాడుతూ.. ఆడ పిల్లలను రక్షిద్దాం, ఆడ పిల్లలను చదివిద్దామన్నారు. డీఈవో కె.వెంకటేశ్వరరావు, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి ఎస్.నీరజ, జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ, ప్రిన్సిపాల్ ఆర్.రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

లింగ వివక్షలేని సమాజం అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: లింగ వివక్షలేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సమాజిక కార్యకర్త, విశాఖపట్నం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యురాలు, న్యాయవాది రషి మున్నియా బేగం అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో జాతీయ బాలకల దినోత్సవాన్ని నిర్వహించారు. వైస్‌చాన్సలర్ కె.ఆర్.రాధక రిజస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఖేలో ఇండియా పోటీల అంపైర్‌గా సూరిబాబు



శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా యూత్ నేషనల్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు అంపైర్‌గా జిల్లాకు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సంపతిరావు సూరిబాబు నియమితులయ్యారు. చెన్నై వేదికగా ఈ నెల 25 నుంచి 31 వరకు జరిగే ఈ పోటీల కోసం బుధవారం సాయంత్రం ఇక్కడి నుంచి పయనమై వెళ్లారు. ఈయన ఎచ్చెర్ల మండలం చిలకపాలెం జెడ్పీహెచ్ స్కూల్‌లో పీడీగా పనిచేస్తున్నారు. ఈయన నియామకంపై ఏపీబీఏ ఉపాధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, జిల్లా కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, ఒలింపిక్, పీఈటీ సంఘ ప్రతినిధులు, చిలకపాలెం స్కూల్ హెచ్ఎం చౌదరి లీలావతి కుమారి, ఉపాధ్యాయులు, పీఈటీలు హర్షం వ్యక్తం చేశారు.

22 మద్యం సీసాలు స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ గ్రామంలో ఓ వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో మద్యం విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు.

నడకతో ఆరోగ్యమైన సమాజం

శ్రీకాకుళం కల్చరల్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి నడక సంఘాల కృషి అభినందనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 గవర్నర్ జామి నారాయణ స్వామి అన్నారు. స్థానికంగా ఒక ప్రైవేటు ఫంక్షన్‌హాలులో మంగళవారం రాత్రి 2024 స్టార్ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యం ఆనందంతో పాటు నిరుపేదలకు చేయుత నిచ్చే అనేక సామాజిక కార్యక్రమాలు చేయడంలో ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో అగ్రస్థానంలో నిలిచిన స్టార్ వాకర్స్ అన్ని క్లబ్‌లకు ఆదర్శంగా నిలచిందని కొనియాడారు.

నూతన కార్యవర్గం

అధ్యక్షుడుగా బి.వి.రవిశంకర్, ప్రధాన కార్యదర్శిగా బి.దేవీప్రసాద్, కోశాధికారిగా గోలి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడుగా బొడ్డేపల్లి ప్రసాదరావు, జాయింట్ సెక్రటరీగా బి.వెంకట సత్యన్నారాయణ, జోలి వాకర్‌గా మలిపెద్ది మల్లిబాబు, గౌరవ అధ్యక్షులుగా జి.ఇందిరాప్రసాద్, మరో ఆరుగురు బోర్డు డైరెక్టర్లుగా ఎన్నికైనారు. పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.